# అనుమానం

శ్రీమతి కమలాదాస్

గోపీమీనన్‌కు భార్య తనకుద్రోహం చేస్తోందేమోనని అనుమానం వచ్చేసరికి వాళ్ళ వైవాహిక జీవితానికి ఆరేళ్ళ వయసు. అర్ధరాత్రి దాటాక ఉదయం రెండుగంటల ప్రాంతంలో అతను పక్కమీద భార్యదగ్గర దొర్లాడు. ఆమె యింకా నిద్రపోతోంది. ఆ మత్తులోనే వుంది. కళ్ళు యింకా పూర్తిగా తెరిపిన పడలేదు. అతన్ని దగ్గరకు లాక్కుని చుట్టూ రెండుచేతులూ బిగించి 'సనాతన్—నాప్రాణం' అంది గొణుగుతున్నట్లుగా.

సనాతన్....! ఎవరీ సనాతన్?

గోపీమీనన్ యీసంఘటన తరువాత నిద్రపోలేక పోయినాడు. బాగా తెల్లవారి కిటికీలోంచి సూర్యకిరణాలు గదిలో చొరబడి శరీరాన్ని పొడుస్తూవున్నా యింకా ఆమె కౌగిలిలోనే కదులుతూ పడుకుని వుండిపోయినాడు గాని లేచి పూర్తి స్పృహ తెచ్చుకుందుకు ధైర్యం చాలకుండాపోయింది. ఆమెనే నిలబెట్టి "ఎవరీ సనాతన్?' అని అడగవచ్చును. కాని తన 'అహం' అడ్డు వస్తుంది, యిలా చేయాడానికి.

ఆమె వంట యింట్లో ఉదయపు టిఫిన్లు వగైరా చేయడంలో మునిగివుండగా ఆమె బట్టల అలమారు తెరచి చూచాడు. అబ్బ! ఇన్ని పట్టు చీరలు ఎప్పుడు కొనుక్కుంది? ఎలా కొనుక్కోగలిగింది? పోయిన దీపావళికి తను ఒక పట్టుచీర కొని యిచ్చినట్లు గుర్తు. అలమారాలో హాంగర్‌కు దాదాపుయాభై సిల్కుచీరలు వేలాడుతున్నాయి. సగర్వంగా ఊగుతున్నాయి. ఆమెఫలహారపు పళ్ళెం యేకంగా పడక గదిలోనికే తీసుకువచ్చి యేంటి నాఅలమరు అంతా కెళ్ళగిస్తున్నారు? ఏంకావాలని' అంది.

'ఇంత ఖరీదు అయిన చీరలన్నీ ఎప్పుడు కొనుక్కున్నావు? ఇవన్నీ అసలయిన కంచి పట్టు చీరలుగదా!' అన్నాడు అతను.

'కంచి పట్టు చీరలా?' ఆమె పెద్దగా నవ్వింది. ఆమె పలువరుస మిలమిల మెరసి ముఖానికి మరింత అందం వచ్చింది. ఆమె అలా నవ్వడం అతనికి

యెంతో ఇష్టం ఎంత సేపయినా ఆ నవ్వు చూస్తూ వుండిపోగలదు. 'ఈ చీరలు ఒక్కొక్కటీ పదిరూపాయల కంటే ధర చేయవు. ఆర్టు సిల్కు చీరలు. 'మాతుంగా' నుంచి ప్రతివారం ఓ ఆసామీ యిటువంటి చీరలు తీసుకువచ్చి యీ కాంపౌండ్‌లో వాళ్ళందరికీ అంట గట్టివెడుతూవుంటాడు.' ఆమె యింకా నవ్వుతూనే వుంది.

అతను 'బాంద్రా' వెళ్ళటానికని ప్లాట్ ఫారం మీద నిలబడి వున్నాడు. రైలు కోసంఉన్నట్లుండి ఆమె వ్యవహారం పసి గట్టటానికో మార్గం దొరికింది- ఊహకు అందింది. అలా చేస్తే అన్ని అనుమానాలు తొలగిపోతాయి. వెంటనే యింటికి తిరిగి వచ్చాడు.

అతను యింకా వాళ్ళ యింటి వీధి చివరకు వచ్చేసరికి విచిత్రం కనిపించింది. అతని భార్య చేతిసంచి వూపుకుంటూ యింటిలోనుంచి వీధిలోకి వస్తూంది. నీలం రంగు చీర కట్టుకుంది. సరిగ్గా అప్పుడు అతనో స్తంభం వెనకాల నక్కాడు. ఆమె వడివడిగా టాక్సీస్టాండ్ వయిపు అడుగులు వేస్తోంది. అతను ఒక టాక్సీపట్టుకుని ఆమెను అనుసరించాడు. రిడ్జ్ రోడ్‌లోఒక బంగళా ముందు ఆమె టాక్సీ ఆపింది. గేటు తెరుచుకుని స్వతంత్రంగా యింటిలోనికి వెళ్ళిపోయింది. అతను తన టాక్సీని పంపించేసి ఆ గేటు దగ్గర తచ్చాడ సాగాడు. పోర్టికో తలుపులు తెరుచుకోవడం, లోపలనుంచి నౌకరు ఆమెను చూచి నమస్కారం చేసి లోనికి తీసుకుపోవడం, తలుపులు మూతబడడం.... అంతా గమనించాడు.

మీనన్ చుట్టూతిరిగి ఆ యింటి పెరటి వైపుకు చేరుకున్నాడు. ఓ పక్క కిటికీ రెక్కలుతెరచివుంటే అటువైపు వెళ్లాడు. లోపలి డైనింగ్ రూం కనిపిస్తోంది.మీనన్ అద్దాల సందునించి చూడగలుగుతున్నాడు. ఓ పెద్దడైనింగ్ టేబుల్ కనిపిస్తోంది. ఓ పక్కన తన భార్య మరోపక్క ఒక వృద్ధుడు కూర్చునివున్నారు. ఆమె గబగబ ఫలహారం చేస్తోంది. ఆయన సిల్కు డ్రస్సింగ్‌గౌనులో వున్నాడు. ఆమె ఫల హరంచేయడం ముగియడంతోటే, ఆ వృద్ధునికిదగ్గరగా వచ్చి నుదుటపైమృదువుగా ముద్దు పెట్టుకుంది. అతనామెనో నిమిషం పాటు అక్కున చేర్చుకున్నాడు. ఆమె గదిలో నుంచి వెళ్ళడంతోటే ఆయన తన 'పైప్' వెలిగించుకుని 'న్యూస్‌పేపర్' చదవడంలో మునిగిపోయినాడు. మీనన్ ఈ దృశ్యం చూచి నివ్వెరపోయినాడు. తన భార్య యింత బరి తెగించిన మనిషా? ఇంత ద్రోహం చేయగలుగుతోందా? కేరళలో ఓ మారుమూల గ్రామంలో, పుట్టి పెరిగిన అమ్మాయి-యింత గ్రంథ సాంగురాలుగా తయారయిందా? పరాయి మగవాడి యింటికి వెళ్ళడం యేమిటి. యింతచొరవగా అక్కడ టేబుల్‌మీద ఫలహారం చేయడం యేమిటి. అతనికి ముద్దు అందించడం-అతని కౌగిలిల్లో వొరిగిపోవడం యేమిటి? ఓ భగవాన్! ఇదంతా కల అయితే యెంత బాగుండును! - అనుకున్నాడు గోపీ మీనన్.

ఏదో తెలియని కొత్త ధైర్యాం పుంజుకుని, చుట్టూ తిరిగి ఆ భవనం పోర్టికో చేరుకునాడు. తలుపు దగ్గరకు

వెళ్ళి 'డోర్ బెల్' నొక్కాడు. అంత టితో ఊరుకోకుండా 'తలుపు తెరవండి వేగిరం' అంటూ సింహగర్జన చేశాడు. ఓ నౌకరు తలుపు తెరిచాడు. ఇతని వాలకం చూచి కొస్త ముఖం ముడుచు కున్నాడు.

"మీ యజమానిని చూడాలి తక్షణం"

"అయ్యగారు అమ్మగారు ఫలహారం చేస్తున్నారు. కాస్సేపు కూర్చోండి.... మీ పేరు యేమిటి?" అనడిగాడు నౌకరు.

"గోపాల మీనన్" అన్నాడు దగా బడిన భర్త.

కొన్ని నిమిషాలలోనే గృహ యజ మాని యివతలకు వచ్చాడు. గోపాల మీనన్‌తో షేక్‌హాండ్ చేస్తూ 'నేను సనాతన చౌధురిని. మీకు యేం కావాలి?' అన్నాడు.

"మీ యింట్లో ఒక వాటా అద్దెకు యిస్తారని విన్నాను—"

"ఎవరో ప్రాక్టికల్ జోక్ వేసి వుంటారు మీ మీద. ఎప్పుడో పదేళ్ళ క్రితం నా భార్య వేసిన ప్లాన్ ప్రకారం కట్టించాం యీ యిల్లు. మా పిల్లలు నలుగురూ యీ ఇంట్లోనే పుట్టారు. నా భార్యగానీ పిల్లలు గానీ యెప్పుడూ యింటిలో ఓ భాగం అద్దెకు యిచ్చే విషయమే తలపెట్టలేదు...."

ఆయన యిలా చెబుతూ వుండగా ఆయన భార్య పోర్టికో లోనికి వచ్చింది. గోపాలమీనన్‌ను చూడటంతోటే చెంగు ముఖంమీదకు లాక్కుని యింట్లోకి వెళ్ళిపోయింది.

"అయినా ఒక్క క్షణం ఆగండి." అంటూ చౌధురి 'మృణాళినీ! ఇదుగో, యీయన మన యింట్లో ఒక భాగం అద్దెకు యిస్తారా అంటూ వచ్చారు. ఎవరో తప్పుడు సమాచారం అందించి వుంటారు' అన్నాడు.

ఆమె సుకుమారంగా నవ్వింది. అచ్చంగా తన భార్య నవ్వినట్లే. అదే శోభ! 'మిమ్మల్ని ఎగతాళి పట్టించటానికి చెప్పి వుంటారు. యెవరో.' అంది.

"ఇంత పొద్దునే మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు క్షమించండి." అన్నాడు మీనన్.

"ఫరవాలేదులెండి" అన్నాడుచౌధురి.

గుడ్-బై చెప్పి గోపాలమీనన్ బయ టకు నడిచాడు. పోర్టికోలో నుండి యింకా ఆ దంపతులు తనను గమనిస్తూ వుండడం అతను తల వెనక్కు తిప్పి నపుడు కనిపించింది. గేటుదాటి బయ టకు వచ్చాక సిమెంట్ ద్వారం పక్కగా అమర్చిన 'నేమ్ బోర్డు' చూచాడు. 'సనాతన్ చౌధురి' పేరు చెక్కి వుంది, ముచ్చటగా. ఆమె తన భార్యను చాల వరకు పోలివున్నా నీలం రంగు చీరే ధరించివున్నా మళ్ళీ తల తిప్పి ఆమెను చూడటానికి సాహసించలేకపోయినాడు. 'అనుమానం ఒక రకమయిన విషబీజం సుమా' అనుకుంటూ దగ్గరగా వున్న బస్‌స్టాప్ దగ్గరకు చక చక అడుగులు వేశాడు.

(అనువాదం : 'చక్రవర్తి')